# పెన్ పవర్

10 YEAR ANNIVERSARY 2014 - 2024


తెలంగాణ రౌండప్

శుక్రవారం | 3 జనవరి 2025 | పేజీలు 8





అక్రమ నిర్మాణంలో టకీలా పబ్ నిర్వహణ..




కొత్తగా పెగ్ బ్రో పబ్ మూడోది..

# పబ్‌లపై "పసలేని" చర్యలు..!

# కొత్తగా "మూడో"ది...

- చర్యలు నియంత్రించే విధంగా ఉండాలి కానీ..! కొత్తవి పుట్టుకొచ్చేటట్లు కాదు..!
- బార్ అండ్ రెస్టారెంట్‌ల పేరుతో.. అనుమతుల్లేని పబ్‌ల నిర్వహణ..


మాధవ్ పత్తి..
మేడ్చల్ జిల్లా బ్యూరో,

పెన్ పవర్, జనవరి 2:

అనుమతుల్లేని పబ్‌లు ప్రజల ప్రశాంతతకు బగ్నం కలుస్తున్నాయి.. సమాజానికి ఏం మెస్సేజ్ ఇస్తున్నారో తెలియదు కానీ..! కట్టడి చేయాల్సిన బాధ్యత గల ప్రజాప్రతినిధులే పబ్బులను ప్రారంభించడం బాధాకరం.. ప్రజాప్రతినిధుల అండతో నిర్వహిస్తున్న పబ్‌లు నిబంధనలు అతిక్రమిస్తున్నాయి.. లౌడ్ స్పీకర్‌లతో లైవ్ మ్యూజిక్‌లు, స్క్రీన్‌లు, డ్యాన్స్‌లతో హెూరెత్తిస్తున్న పబ్‌లతో..! పరిసరాల ప్రజలకు ఇబ్బందిగా తయారయ్యాని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. మరోవైపు పోలీసులు కూడా ఫిర్యాదులు వస్తే కానీ స్పందించే పరిస్థితి లేదనే విమర్శలు లేకపోలేదు..




అనుమతుల్లేని బాచుపల్లి గోల్డెన్ బారెల్ పబ్..

- బార్ అనుమతులతో బాచుపల్లిలోని టకీల పబ్, గోల్డెన్ బారెల్, పెగ్స్ బ్రో అంటూ విచిత్ర పేర్లు..
- నిజాంపేట్ కార్పోరేషన్‌లో బెంబేలెత్తిస్తున్న "పబ్ కల్చర్" వ్యాపారంలో బిల్డర్‌లు,సాఫ్ట్‌వేర్‌లు..
- పబ్‌లను ఆరంభంలోనే నియంత్రించక పోతే.. భావి తరాల భవితవ్యం బుగ్గిపాలు..
- ఎడ్యుకేషన్ హబ్‌లో పబ్‌ల బెడదపై అధికారుల నిర్లక్ష్యం..!
- ఆదిలోనే బ్యాన్ చేస్తే పోయేదేముంది..? ముడుపులు తప్ప..?
- బీ-అలర్ట్ ఆఫీసర్స్ యువత భవిష్యత్తు మీ నిర్ణయం ముడిపడివుంది..
- పలుకుబడి, సిఫార్సులకే ప్రాధాన్యత..! చర్యలకు వెనకడుగు వేస్తే..! భవిష్యత్తు అంధకారమే..!


-2లో




పబ్‌లో మందేసి చిందేసే దృశ్యాలు..

## సంక్రాంతికి రైతు భరోసా.. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు

హైదరాబాద్ పెన్ పవర్: ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా స్కీమ్ అమలుపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం (జనవరి 2) కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలతో


-3లో





## పారా అథ్లెట్ దీప్తి జివాంజీకి సీఎం రేవంత్ అభినందనలు

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ అమ్మాయి, పారిస్ పారాలింపిక్స్ పతక విజేత దీప్తి జివాంజి అర్జున అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా దీప్తి జివాంజికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి శభాకాంక్షలు తెలిపారు. పారాలింపిక్స్‌లో భారత్ తరఫున కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్, వరంగల్ జిల్లా ముద్దుబిడ్డ దీప్తి జీవాంజి విశిష్ట క్రీడా పురస్కారం అర్జున అవార్డు 2024కు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు


-3లో




# పబ్‌లపై "పసలేని" చర్యలు..! కొత్తగా "మూడో"ది..



కొత్తగా పెగ్ బ్రో పబ్ నిర్వహించే భవనం..



యువతను ఆకర్షించే విధంగా గోల్డెన్ బ్యారెల్ పబ్..


డీజే సౌండ్ సిస్టమ్ నిర్వహకులు పోలీసుల ఆధీనంలో.. ఫైల్ ఫోటో..

**గత పదేళ్ళ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో విసుగెత్తి కొత్తదనంకోసం పాకులాడిన ప్రజలకు చుక్కెదురైందని చెప్పాలి.. ప్రస్తుత ప్రభుత్వంలోనూ పాత పద్దతులే అవలంభిస్తున్నారని.. ప్రజల కోరుకున్న పాలన లభించలేదని విమర్శనాత్మకంగా చర్చించుకుంటున్నారు.. ఏడాది పాలనలో కోరుకున్న మార్పులేక, ప్రజల్లో అసహనం మొదలైందని ఆరోపిస్తున్నారు.. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలకు ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని తీసుకోవాలని..! బాచుపల్లి పబ్ కల్చర్‌ను తక్షణమే నియంత్రణ దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు..**

-

మొదటి

**పేజీ తరువాయి**

మద్యం దుకాణాలు, విద్యాసంస్థలకు దూరంగా ఉండాలనే నిబంధనలతో అమలు చేసిన ప్రభుత్వాలే పబ్ కల్చర్‌ను ప్రోత్సహించడం స్థానికులను కలవర పెడుతుంది.. ఎడ్యుకేషన్ హబ్‌గా ఇప్పుడిప్పుడే వృద్ధి చెందుతున్న బాచుపల్లిలో.. యువతకు చెడు అలవాట్లను అలవరిచే విధంగా ప్రవర్తించడం బాధాకరమైన విషయం.."మందేస్తూ పాడేయరా..! చిందేస్తూ ఆడేయరా..!" అంటూ బాచుపల్లిలో కొత్తదనాన్ని పరిచయం చేస్తున్న పబ్ కల్చర్..! భావితరాల భవితవ్వాన్ని ప్రమాదంలో పడేసే లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.. ఒకటి రెండైంది, రెండు మూడైంది..! బాచుపల్లిలోని మూడు పబ్‌లకి అనుమతులు లేకపోయినా..! ప్రజాప్రతినిధుల అండ మాత్రం మెండుగానే ఉంది.. లైవ్ మ్యూజిక్‌లు, స్క్రీన్ షోలు, డ్యాన్స్ ఫ్లోర్‌లతో యువతకు గాలం వేసే దిశగా పబ్‌ల నిర్వహా కులు ఏర్పాట్లు చేస్తున్నారు.. ప్రభుత్వం ఇప్పటికై నా స్పందించి..! అనుమతుల్లేని మూడు పబ్‌లను ఆదిలోనే రద్దుచేస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.. అయినా ప్రజల బాగోగులు కోరుకునే నేతలు, ప్రజాప్రతినిధులు కూడా ఉన్నారా అంటూ ఎద్దేవా చేసేవారు లేకపోలేదు.. బాచుపల్లితో పాటు పరిసర ప్రాంతాలు కూడా శబ్ద కాలుష్యంతో నరకాన్ని అనుభవిస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి..

## ప్రజా'ప్రతినిధులా'..? పబ్‌లకి "ప్రతినిధులా'..?

ప్రతిఒక్కరిని ఆలోచింపజేసే అంశం ఏమిటంటే..! పబ్‌లను ప్రోత్సహించే ప్రజాప్రతినిధులు సమాజానికి మెసేజ్ ఏమిస్తున్నట్లో తెలియదు కానీ.. వ్యవస్థను భ్రష్టు పట్టించడానికి అని మాత్రం స్పష్టమవుతుంది.. ప్రజలు ఓటేశారు గెలిపించారు, అధికారంలోకి వచ్చేశాం.. ఓ ఐదేళ్ళు మమ్మల్ని ఎవరూ ప్రశ్నించేది, కదిలించేది అనుకుంటారో ఏమో కానీ..! అదే ప్రజలు తలచుకుంటే నేతల తలరాతలు మారుతాయన్న విషయాన్ని మర్చిపోయి వ్యవహరిస్తున్నారు.. బాధ్యతగల ప్రజాప్రతినిధులుగా ఉండి పనికిమాలిన వ్యక్తులుగా వ్యవహరిస్తున్నారు.. వీళ్ళకి తోడు పలు శాఖల అధికారులు కూడా మూడూ బసవన్నల్లా తలూపుతూ తప్పుడు పనుల్లో సహకరించిన ఘటనలు కుత్బుల్లాపూర్‌లోనే కోకొల్లలు ఉన్నాయి.. ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలను సక్రమం చేసేందుకు నేతల ప్రారంభోత్సవాలు..! ప్రభుత్వ భూమి అన్న విషయాన్ని మరిచిపోయి నియోజకవర్గం అభివృద్ధి నిధులతో కోట్లాది రూపాయలు వెచ్చించి సీసీరోడ్లు వేస్తుంటే ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్ చేసిన అధికారులు కూడా మూర్ఖంగా సహకరించడం బాధాకరం..కొంత మంది ప్రజా ప్రతినిధులు దేన్నీ పడితే దాన్ని ప్రారంభిస్తూ బాధ్యతను మరిచిపోతున్నారు..

## బార్ పర్మిషన్‌లతో..! పబ్‌ల నిర్వహణ..!

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో "నీర" పేరుతో కళ్ళు కాంపౌండ్‌లను విచ్చలవిడిగా నిర్వహించేందుకు కారణం కాగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో "ఎడ్యుకేషన్ హబ్‌లు– పబ్‌ల హబ్‌గా" మారుతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు.. వ్యాపారాత్మక ఆలోచనలతో అధికంగా యువతను ఆకర్షించేందుకు..! విద్యాసంస్థలకు నిలయంగా ఉన్న బాచుపల్లి లాంటి ప్రదేశాలలో బార్ అనుమతులతో ఏకంగా పబ్‌లు నిర్వహిస్తున్నారు.. బార్ నిర్వాహకులకు, సంబంధిత శాఖల అధికారులకు ఉన్న నిరంతర పరిచయాలు, పబ్‌లపై చర్యలు చేపట్టకుండా అధికారులను వెనకడుగు వేయిస్తుందని ఆరోపణలు కోకొల్లలు.. పబ్‌ల యాజమాన్యాలు. బాచుపల్లి లోని "టకీల పబ్", "గోల్డెన్ బారెల్" పబ్‌లతో స్థానికులు యుద్ధం చేస్తున్న నేపథ్యంలో కొత్తగా "పెగ్ బ్రో" అంటూ బార్ అనుమతులు పొంది వాటి మాటున పబ్‌ను నిర్వహించడం విశేషం..

## అర్హత లేకపోయినా..! అధికారుల ప్రోత్సాహం..!

పబ్‌ల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు కాలరాస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.. నిజానికి బార్ అనుమతి పొందలటేనే 11 రకాల అనుమతులు ఉండాలి.. కానీ బాచుపల్లిలో మాత్రం ఏ ఒక్క పబ్‌కు అనుమతులు లేవు. అయినప్పటికీ నిరభ్యంతరంగా పబ్‌లు నిర్వహిస్తూ, అడ్డగోలుగాహడోచుకుంటున్నారు.. మరోవైపు అక్రమ నిర్మాణాలలో పబ్‌లు నిర్వహిస్తున్నారని సంబంధిత అధికారులకి ఆకుల సతీష్ ఆధ్వర్యంలో స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేయగా..! పోలీసులు పసలేని కేసులు నమోదు చేసినప్పటికీ..! ఉన్న పబ్‌లకు కొసరు అన్నట్టు అదనంగా మూడోది "పెగ్ బ్రో" అంటూ కస్టమర్‌లను ఊరించే పేర్లతో మూడో పబ్ పెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.. మరోవైపు పోలీసులకి నేతల ఒత్తిడి పెరిగి పట్టించుకునే పరిస్థితి లేదని ఆరోపణలు వస్తున్నాయి..

## ఫిర్యాదులు చేస్తేనే స్పందిస్తారా..? అధికారుల బాధ్యతేది..?

బాచుపల్లి లోని టకీల, గోల్డెన్ బారెల్, పెగ్ బ్రో పబ్ లపై స్థానికులు పిర్యాదు చేస్తే తప్ప పోలీసులు స్పందించే పరిస్థితి లేదనే విమర్శలు ఉన్నాయి.. వాస్తవానికి లైవ్ మ్యూజిక్, డ్యాన్స్ ఫ్లోర్, స్క్రీన్ మ్యూజిక్ పెట్టాలంటే కచ్చితంగా పోలీస్ శాఖ నుండి అమ్యూస్మెంట్ సర్టిఫికెట్ పొందాలి. హైద్రాబాద్, సైబరాబాద్ పరిధిలో పోలీసులు పబ్‌ల నిర్వహణకు అమ్యూస్మెంట్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదు.. అయినప్పటికీ..! అనుమతులు తీసుకోకుండానే కిందిస్థాయి సిబ్బందిని మేనేజ్ చేస్తూ,సంబంధిత పబ్‌ల నిర్వాహకులు యధేచ్ఛగా పబ్‌లు నిర్వహిస్తున్నారు.. అడ్డుకోవడానికి ప్రజల తరపున నిలబడే ప్రజాప్రతినిధులే పబ్‌లకి సహకరిస్తుంటే..! చేసేదేముందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు..

## రెసిడెన్షియల్ జోన్‌లో.. పబ్‌ల నిర్వహణ..

సిస్టమ్ మారకపోతే..! హైదరాబాద్ మరో నియంతృత్వ విధానాల జాబితాలో చేరే అవకాశం లేకపోలేదు.. బాచుపల్లిలో పబ్‌ల నిర్వహణ రెసిడెన్షియల్ ప్రాంతాల్లో "టకీల పబ్, గోల్డెన్ బారెల్, పెగ్ బ్రో పబ్"లను ఏర్పాటు చేసుకుని స్థానికుల ప్రశాంతతను కాల రాస్తున్నారు.. నిబంధనల ప్రకారం రెసిడెన్షియల్ ఏరియాలో పబ్‌లకు అనుమతి లేదు. బార్ లేదా పబ్ పెట్టాలంటే కచ్చితంగా స్థానికుల నుండి ఎన్‌ఓసీ తీసుకోవాలి.. కానీ ఏ ఒక్క పబ్‌కు కూడా స్థానికుల ఎన్‌ఓసీ లేదు.. వారాంతం వచ్చిందటే చాలు, బాచుపల్లి పబ్‌ల పరిసర ప్రాంతాల వాసులకు నిద్రపట్టదు.. పెద్ద పెద్ద శబ్దాలతో దద్దరిల్లుతున్నాయని స్థానికులు వాపోతున్నారు..

## నిర్మల్‌లో బీజేపీకి షాక్... బీఆర్‌ఎస్‌లో చేరిన సీనియర్ నేత

- బీఆర్‌ఎస్‌లో చేరిన నిర్మల్ నియోజకవర్గ సీనియర్ నేత మహేశ్ రెడ్డి
- కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్న మహేశ్ రెడ్డి
- నిర్మల్‌లో పార్టీ బలోపేతం కోసం పని చేస్తానని హామీ



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలోని నిర్మల్ జిల్లాలో బీజేపీకి షాక్ తగిలింది. నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బీజేపీ సీనియర్ నేత పీవీ మహేశ్ రెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి... బీఆర్‌ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఆయన గులాబీ కండువాను కప్పుకున్నారు.కేటీఆర్ ఆయనకు పార్టీ కండువాను కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా మహేశ్ రెడ్డి మాట్లాడుతూ... నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెట్రోలో ఫొటోలు తీసిన ప్రయాణికుడు..కోపంతో ఊగిపోయిన మహిళ.. పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్ పెన్ పవర్:అతనికి ఫొటోలు తీయడం సరదానో లేక మెట్రోలో కిక్కిరిసిన జనం ఉండటంతో ఆశ్చర్యంతో తీశాడో తెలియదు కానీ.. ఓ వ్యక్తి క్రౌడ్ ఫొటోలు తీయడం పెద్ద వివాదాస్పదమైంది..నా ఫొటోలే తీస్తావా అంటూ ఆ క్రౌడ్ లో ఉన్న మహిళ కోపంతో ఊగిపోయింది.. అతన్ని ఎడా పెడా మాటలతో వాయించింది. అంతటితో ఆగక పోలీసులకు కూడా ఫిర్యాదు చేసింది. డిసెంబర్ 30, 2024..కొత్త సంవత్సరం సమీపిస్తున్న సమయం కూడా..దీంతో బెంగళూరు మెట్రో స్టేషన్లు, మెట్రోరైళ్లు జనంతో కిక్కిరిసి పోయాయి. క్రౌడ్ ఎన్నడూ ఇసుక వేస్తే రాలనంతగా ఉంది.. దీంతో కొంత ఆశ్యర్యానికి గురైన మహేష్ అనే ప్రయాణికుడు జనాన్ని ఫొటోలు తీయడం మొదలు పెట్టాడు.. అదే పెద్ద వివాదమైంది.. అతన్ని పోలీస్ స్టేషన్ కు ఈడ్చింది.

మహేష్ అనే వ్యక్తి కదులుతున్న మెట్రో రైలులో జనరల్ గా ఫొటో తీస్తున్నాడు..అది గమనించిన ఓమహిళ మహేష్ పై విరుచుకుపడింది. ఓ రేంజ్ లో తిట్ల దండకం అందుకుంది. ఫొటోలు ఎందుకు తీస్తున్నావు..అందులో నా ఫొటోలు కూడా ఉన్నాయి.. వెంటనే డిలిట్ చేయాలని అని కోపంతో ఊగిపోయింది.. ఆమె 112 కి కాల్ చేయడంతో పోలీసులు ఇద్దరిని పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారు. అయితే అతను ఎలాంటి అభ్యంతర కరమైన ఫొటోలు తీయలేదు.. అయితే ఆమె తన ఫొటోను తొలగించాలని కోరింది.. నాక్ కాగ్నిజబుల్ రిపోర్టు దాఖలు చేసిన పోలీసులు తెలిపారు. అయితే మహేష్ ఇంతకు ముందు మహిళలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలాంటి ఏమైనా తీశాడా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

## పారా అథ్లెట్ దీప్తి జివాంజీకి సీఎం రేవంత్ అభినందనలు

- మొదటి పేజి తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి. అంతర్జాతీయ, జాతీయ క్రీడల్లో సత్తా చాటే యువ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ప్రజా ప్రభుత్వ స్పోర్ట్స్ పాలసీలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి దీప్తికి రూ.1 కోటి నగదు బహుమతితో పాటు గ్రూప్-2 స్థాయి ప్రభుత్వ ఉద్యోగం, వరంగల్‌లో 500 గజాల స్థలం కేటాయించిన విషయం తెలిసిందే. తెలంగాణ యువ క్రీడాకారులు మరింతగా రాణించాలని, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, రాష్ట్ర వ్యాప్తంగా నిర్మితం కానున్న స్పోర్ట్స్ కాంప్లెక్సులు అందుకు దోహదపడతాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అలాగే, క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఎంపికైన గుకేష్ (చెస్), హర్మన్ ప్రీత్ సింగ్ (హాకీ), ప్రవీణ్ కుమార్ (ప్యారా అథ్లెటిక్స్), మను బాకర్ (షూటింగ్)లకు సైతం సీఎం రేవంత్ కంగ్రాట్స్ చెప్పారు. వీరితో పాటు 2024కు సంబంధించి వివిధ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అర్జున, ద్రోణాచార్య అవార్డులకు ఎంపికైన క్రీడాకారులు, కోచ్‌లకు కూడా రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

# ఫిక్స్‌డ్ డిపాజిట్లపై కొత్త రూల్స్..డిపాజిటర్లు తప్పక తెలుసుకోవాల్సిన విషయాలు




హైదరాబాద్ పెన్ పవర్:పొదుపు చేయాలని అందరికీ ఉంటుంది.. అలాంటి వారికోసం పొదుపు చేసేందుకు అనేక మార్గాలు ఉన్నాయి.. తక్కువ టర్మ్..ఎక్కువ రిటర్న్ వచ్చే మార్గాల కోసం చూస్తుంటాం. ఇటువంటి వాటిలో ఫిక్స్ డ్ డిపాజిట్లు(%ఖీణ%) ఒకటి.. అయితే ఫిక్స్ డ్ డిపాజిట్లు చేసే ముందు వాటి రూల్స్ గురించి తెలుసుకోవడం మంచిది..2025 లో %ఖీణ%లపై కొత్త రూల్స్‌వచ్చాయి. వాటి గురించి తెలుసుకుందాం. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేవారికి రిజర్వ్ బ్యాంక్‌ఆఫ్ ఇండియా రూల్స్ సవరించింది. కొత్త రూల్స్ జనవరి 1,2025 నుంచి అమలులోకి వచ్చాయి. హౌసింగ్ ఫైనాన్స్ కంపె నీలు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు డిపాజిటర్లకు సేవలను మరింత సులభతరం చేసేందుకు ఈ కొత్తరూల్స్ తీసుకొచ్చారు. సవరించిన రూల్స్ ఇవే..

**చిన్న డిపాజిట్లు:**

కొత్త రూల్స్ ప్రకారం.. డిపాజిటర్లు రూ. 10వేల లోపు డిపాజిట్లనుంచి మొత్తం అమౌంట్ ను డ్రా చేసుకోవచ్చు.. డిపాజిట్ చేసిన మూడునెలల తర్వాత డ్రా చేసుకో వచ్చు. అయితే ఈ మొత్తానికి వడ్డీ చెల్లింపులు ఉండవు.

**పెద్ద డిపాజిట్లు..**

పదివేల కంటే ఎక్కువ మొత్తం ఉన్న డిపాజిట్ల నుంచి మూడే నెలల్లో 50 శాతం వరకు ,లేదా 5లక్షల వరకు డ్రా చేసుకోవచ్చు. స్మాల్ డిపాజిట్ల మాదిరిగానే ఈ మొత్తా నికి కూడా వడ్డీ ఉండదు.

**అనారోగ్యంగా ఉన్నపుడు ..**

ఒకవేళ డిపాజిటర్‌అనారోగ్యం ఉన్నపుడు డిపాజిట్‌టర్మ్ తో సంబంధం లేకుండా మొత్తం అమౌంట్‌ను ముందుగానే డ్రా చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అయితే ఈ అమౌంట్ కు ఎలాంటి వడ్డీ చెల్లింపులు ఉండవు. ఇది ఇంతకుముందే డిపాజిటర్లకు.. ప్రస్తుతం డిపాజిట్ చేసే వారికి వర్తిస్తుంది.

## పునీత్ ఖురానా వైరల్ వీడియో.. బతికుండగానే నరకం చూపించిన భార్య..

# పగోడు కూడా ఆ బూతులు తిట్టడేమో..!

హైదరాబాద్ పెన్ పవర్:బతికుండగానే భార్యలు నరకం చూపిస్తున్నారని భర్తలు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో పునీత్ ఖురానా ఆత్మహత్యపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. తాజాగా ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. పునీత్ ఖురానాకు, అతని భార్య మనీకా పహ్వాకు మధ్య జరిగిన వాగ్వాదానికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. ఆ సీసీ టీవీ కెమెరాల్లో వీడియోతో పాటు ఆడియో కూడా రికార్డ్ అయింది.ఈ సీసీటీవీ ఫుటేజీలో మనీకా అతని భర్తను ఎంత వేధించిందో స్పష్టంగా తెలిసింది. అమ్మ నా బూతులు తిడుతూ.. నానా రచ్చ చేసింది. ఈ వీడియో నెట్టింట వైరల్ అయింది. ఇప్పటికే 15 నిమిషాల కాల్ రికార్డింగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుంది. బెంగళూరులో అతుల్ సుభాష్ ఆత్మహత్య చేసుకున్న నెలల వ్యవధిలోనే భార్య వేధింపులతో పునీత్ ఖురానా చనిపోవడం గమనార్హం.ఢిల్లీలో ఫేమస్ అయిన వుడ్‌బాక్స్ కేఫ్ సహ వ్యవస్థాపకుడు పునీత్ ఖురానా(40) భార్య వేధింపులు భరించలేక మంగళవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. మోడల్ టౌన్‌లోని కళ్యాణ్ విహార్ ఏరియాలో ఉన్న ఇంటిలో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకున్నాడు. మనికా జగదీశ్ పహ్వా అనే మహిళతో కలిసి పునీత్ ఖురానా ఢిల్లీలో వుడ్‌బాక్స్ కేఫ్ ప్రారంభించాడు. వీరిద్దరూ 2016 లో పెండ్లి చేసుకున్నారు. అయితే, వైవాహిక సమస్యలతో పాటు బిజినెస్‌కు సంబంధించిన విబేధాలతో దంపతులిద్దరూ తరచూ గొడవ పడేవారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈ వివాదాల నేపథ్యంలో విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పునీత్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని.. అందులో దంపతుల గొడవకు సంబంధించిన16 నిమిషాల నిడివి గల కాల్ రికార్డింగ్ ఉందని వివరించారు. వ్యాపార ఆస్తుల విషయంలో ఇద్దరి మధ్య జరిగిన గొడవ జరిగినట్లు ఆధారాలు కూడా లభించాయని చెప్పారు. పునీత్ ఖురానా ఆత్మహత్య కేసులో ఆయన భార్య మనికా జగదీశ్ పహ్వాను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు వెల్లడించారు. దర్యాప్తు కొనసాగుతున్నదని పేర్కొన్నారు. భార్య, ఆమె తల్లిదండ్రులు పెట్టే టార్చర్ వల్లే పునీత్ ఖురానా సూసైడ్ చేసుకున్నాడని అతడి కుటుంబ సభ్యులు కూడా ఆరోపిస్తున్నారు.

# సంక్రాంతికి రైతు భరోసా.. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు

- మొదటి పేజి తరువాయి

ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. సంక్రాంతికి రైతు భరోసా ఇస్తామని రైతులకు తీపి కబురు చెప్పారు. అలాగే కొత్త రేషన్ కార్డులు కూడా త్వరలోనే జారీ చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతుందని.. త్వరలోనే లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు.

మాట ఇచ్చినట్లుగానే సన్న వడ్లకి రూ.500 బోనస్ ఇచ్చాం, వరి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు వేశామని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచామని.. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖునే జీతాలు వేస్తున్నామని గుర్తు చేశారు. 2025 సంవత్సరంలో అంత మంచే జరుగుతుందని.. తాను ప్రాతినిధ్యం వహిస్తోన్న హుస్నాబాద్ గౌరవాన్ని మరింత పెంచుతానని అన్నారు మంత్రి పొన్నం. నియోజకవర్గంలో విద్య, వైద్యం, సాగునీరు అందించడమే నా తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా చిగురు మామిడి, సైదాపూర్ మండలాలకు సాగు నీరు అందించే బాధ్యత నాదని నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పార్టీ బలోపేతం కోసం పని చేయాలని.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గెలవాలని.. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచే ఉండాలని పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్‌ఎస్ లను ధీటుగా ఎదుర్కోవాలని కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ పదేళ్లు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

# సినీ నటి హేమకు కర్ణాటక హైకోర్టులో ఊరట

## గత ఏడాది మే నెలలో బెంగళూరు ఫామ్ హౌస్ లో రేవ్ పార్టీ

## హేమ డ్రగ్స్ తీసుకుందంటూ నమోదైన కేసు

## ప్రస్తుతం బెయిల్ పై ఉన్న హేమ





**హైదరాబాద్ పెన్ పవర్:**కర్ణాటక హైకోర్టులో తెలుగు సినీ నటి హేమకు ఊరట లభించింది. గత ఏడాది మే నెలలో బెంగళూరు ఫామ్ హౌస్ లో జరిగిన రేవ్ పార్టీలో హేమ పాల్గొన్నదని, ఆమె డ్రగ్స్ తీసుకుందని ఆమెపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆమె రిమాండ్ కు కూడా వెళ్లింది. ఈ నేపథ్యంలో, ఈ కేసులో తదుపరి చర్యలపై కర్ణాటక హైకోర్టు స్టే విధించింది. రేవ్ పార్టీలో హేమ ఎండీఎంఏ తీసుకున్నారని నిరూపించే ఆధారాలు లేవని జస్టిస్ హేమంత్ చందన గౌడర్ అన్నారు. సహనిందితుల ఒప్పుకోలు ప్రకటన ఆధారంగానే పిటిషనర్ పై ఛార్జ్ షీట్ వేశారని చెప్పారు. 8వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి, బెంగళూరు రూరల్ ఎన్డీపీఎస్ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ముందు పెండింగ్ లో ఉన్న ఛార్జ్ షీట్, తదుపరి విచారణపై స్టే కోరుతూ హేమ ఇంటర్ లొకేటరీ అప్లికేషన్ ను దాఖలు చేసింది. దీన్ని విచారించిన ఉన్నత న్యాయస్థానం ఆమెపై తదుపరి చర్యలపై స్టే విధించింది. ప్రస్తుతం హేమ బెయిల్ పై ఉన్న సంగతి తెలిసిందే.


# మందు తాగితే వాంతులు ఎందుకు అవుతాయో తెలుసా..

**హైదరాబాద్ పెన్ పవర్:** పండగ వచ్చినా.. పబ్బం వచ్చినా.. సంతోషం వచ్చినా.. దు:ఖం వచ్చినా.. ఓ పెగ్ వేయాల్సిందే.. బీరు బాటిల్ ను పొంగించాల్సిందే.. సరదాగా నలుగురు కలిసినా అదే పని. ఇలా చేయడం వలన జీవితం నిర్వీర్యం అవుతుందని తెలిసినా మద్యానికి బానిస అవుతారు. అరేయి ఇక వద్దురా బాబూ.. తాగింది చాలు ఇక ఆపరా అని మన శరీరం హెచ్చరిస్తున్నా.. పలు సిగ్నల్స్ పంపుతున్నా.. అవేం పట్టించుకోకుండా నా సామిరంగా అంటూ మద్యం తాగుతూనే ఉంటారు. కాని చాలా మందికి మద్యం తాగితే వాంతులు అవుతాయి.. అయినా సరే పట్టించుకోకుండా పీకలదాకా తాగుతారనుకోండి.. మద్యం తాగితే వాంతులు ఎందుకు అవుతాయో ఈ స్టోరీలో తెలుసుకుందాం. . చాలామంది మద్యం తాగిన తరువాత వాంతులు చేసుకుంటారు. ఆల్కహాల్ శరీరంలోకి వెళ్లిన తరువాత ఎసిటాల్డిహైడ్ అనే రసాయన పదార్థం విడుదలవతుంది. ఇది పొట్టలో వికారాన్ని కలుగజేస్తుంది. కడుపులో తిప్పుతూ... వాంతులను ప్రేరిస్తుంది. ఈ రసాయనం శరీరంలో రిలీజైనప్పుడు .. ఇక తాగొద్దు వాంతులవుతాయని బ్రెయిన్ రెడ్ సిగ్నల్స్ ఇస్తుంది. అయినా సరే తాగామా.. వెళ్లేది ఇంటికాదు.. నేరుగా మనుషులను రిపేర్ చేసే షెడ్డుకు.. అదేనండి ఆస్పత్రికి. మందు తాగేటప్పుడు కెపాసిటీని బట్టి తాగాలి.. కొందరికి కిక్కు త్వరగా ఎక్కితే... మరికొందరికి లేట్ అవుతుంది.అతిగా మద్యం సేవిస్తే వాంతులే కాదు .. చాలా దుష్ప్రభావాలుంటాయి. మెదడులో నరాలు దెబ్బతినడం.. లివర్ డ్యామేజ్ అవుతుంది.ఇంకా శరీరంలోని అన్ని పార్టులను దెబ్బతీ స్తుంది. తలనొప్పి, మైకం, నీరసం, బద్ధకం వంటివి ఉంటాయి. అంటే.. మీ బాడీ సామర్థం కంటే మీరు ఎక్కువ ఆల్కాహాల్ తీసుకున్నారని... ప్రజంట్ అయితే.. హ్యాంగోవర్‌ను తప్పించుకో వడానికి ఎలాంటి మెడిసిన్స్ లేవు. లివర్.. గంటకు 8 నుంచి 12 గ్రాముల మధ్య ఆల్కహాల్‌ను బ్రేక్ చేస్తుంది. మీరు హ్యాంగోవర్‌లో ఉన్నారంటే.. మీ లివర్ ఆ ప్రాసెస్ ఇంకా కంప్లీట్ చేయలేదు. అప్పుడు ఆరోగ్య పరంగా చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

# అల్లు అర్జున్ తప్పేమీ లేదు: బోనీకపూర్

- జనాలు ఎక్కువగా రావడం వల్లే సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగిందన్న బోనీకపూర్
- దక్షిణాది ప్రేక్షకులకు తమ హీరోలపై అభిమానం ఎక్కువగా ఉంటుందని వ్యాఖ్య
- అగ్ర హీరోల సినిమాలకు జనాలు భారీగా వస్తారన్న బోనీకపూర్






**హైదరాబాద్ పెన్ పవర్:**సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఈ ఘటనపై ప్రముఖ బాలీవుడ్ నిర్మాత బోనీకపూర్ స్పందించారు. ఈ ఘటనకు అల్లు అర్జున్ ను నిందించాల్సిన అవసరం లేదని... ఎక్కువ మంది జనాలు రావడం వల్లే తొక్కిసలాట జరిగిందని ఆయన అన్నారు.దక్షిణాది ప్రేక్షకులకు తమ అభిమాన హీరోలపై అభిమానం ఎక్కువగా ఉంటుందని బోనీకపూర్ చెప్పారు. తమిళ స్టార్ అజిత్ నటించిన ఒక సినిమాకు అర్ధరాత్రి షోకు తాను వెళ్లానని... దాదాపు 20 వేల మంది థియేటర్ దగ్గర ఉన్నారని... సినిమా థియేటర్ వద్ద అంతమందిని చూడటం తనకు అదే తొలిసారని అన్నారు. సినిమా పూర్తయ్యాక తెల్లవారుజామున 4 గంటలకు బయటకు వచ్చినప్పుడు కూడా అంతే మంది ప్రేక్షకులు థియేటర్ బయట ఎదురు చూస్తున్నారని చెప్పారు.

చిరంజీవి, రజనీకాంత్, రామ్ చరణ్, మహేశ్ బాబు, అల్లు అర్జున్ వంటి అగ్ర హీరోల సినిమాలకు ప్రేక్షకులు ఇలాగే వస్తారని బోనీకపూర్ అన్నారు. జనాలు ఎక్కువగా వచ్చినందుకే సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట చోటుచేసుకుందని చెప్పారు.

# స్కంద షష్ఠి.. సంతాన షష్ఠి.. జనవరి 5న పూజా విధానం ఇదే..

**హైదరాబాద్ పెన్ పవర్:**హిందూ మతంలో పండుగులకు చాలా ప్రాధా న్యత ఇస్తారు. సంతాన దేవతను శుబ్రమణ్యేశ్వరుడిగా భావిస్తారు. ఈయననే సంతానచ దేవత అంటారు. కుమారస్వామి.. స్కందస్వామి.. మురుగన్.. షణ్ముక స్వామి ఇలా అనేక పేర్లతో పిలుస్తారు. అంతేకాదు సంధషష్టిని.. కార్తికేయుడి జన్మదినంగా జరుపు కుంటారు. స్కంద షష్ఠి రోజున కార్తికేయుడిని ఎలా పూజించాలో తెలుసుకుందాం.



జనవరి 5 వ తేదీన శుబ్రమణ్య షష్ఠి.. ఈ రోజున కార్తికేయుడిని పూజించడం వల్ల కష్టాలు తీరతాయని.. జీవితంలో విజయం చేకూరుతుందని పండితులు చెబుతున్నారు. అనేక సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అంతేకాదు ఇంట్లో సుఖసంతోషాలు, శ్రేయస్సు నెలకొంటాయి. ఈ రోజున (జనవరి 5) కార్తికేయుడిని పూజించడం వల్ల అన్ని రకాల కష్టాలు తొలగిపోతాయి.పుష్య మాసంలోని శుక్ల పక్ష షష్ఠి తిథి జనవరి 04న రాత్రి 10 గంటలకు ప్రారంభమై మర్నాడు అంటే జనవరి 05 రాత్రి 08:15 గంటలకు ముగుస్తుంది. ఉదయ తిథి ప్రకారం స్కంద షష్ఠి జనవరి 05వ తేదీ 2025 న జరుపుకుంటారు. భక్తులు కార్తికేయుడిని పూజించే స్కంద షష్ఠి కొత్త సంవత్సరంలో ఇదే మొదటి స్కంద షష్టి.

**కార్తికేయుడిని ఎలా పూజించాలంటే**

బ్రహ్మముహూర్తానికి నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకోవాలి.

పూజా మందిరాన్ని శుభ్రం చేసుకోవాలి.

శుభ్రమైన స్థలాన్ని ఎంచుకుని ఆ ప్రదేశాన్ని పూలతో దీపాలతో అలంకరించండి.

పీఠంపై కార్తికేయ విగ్రహాన్ని లేదా చిత్ర పటాన్ని ప్రతిష్టించండి.

కార్తికేయ స్వామి ముందు ఆవు నెయ్యి దీపం వెలిగించండి.

నీరు, పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, చందనం, అక్షతం, పుష్పాలు, ధూపం, దీపం, నైవేద్యం అన్నిటిని దగ్గరపెట్టుకోండి

గంగాజలం, పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదారతో కార్తికేయుడిని అభిషేకించండి.

దేవుడికి చందనం, అక్షతలు సమర్పించండి.

పూజ సమయంలో ఓం స్కంద శివాయ నమః అనే మంత్రాన్ని జపించండి.

దేవుడికి పూలు సమర్పించడం, తామరపువ్వులను సమర్పించడం విశేషంగా భావిస్తారు.

దేవుడికి పండ్లు, స్వీట్లతో పాటు ఆహార పదార్థాలను నైవేద్యంగా సమర్పించండి.

కార్తికేయ ( శుబ్రమణ్యేశ్వర) అష్టోత్తరనామాలు చదువుతూ పూజ చేయండి.

స్కంద షష్ఠి రోజున పేదలకు, ఆపన్నులకు అవసరమైన వస్తువులను దానం చేయండి.

**స్కంద షష్టి రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

స్కంద షష్ఠి వ్రతం సూర్యోదయ సమయంలో ప్రారంభమై మరుసటి రోజు సూర్యభగవానుడికి అర్ఘ్యం సమర్పించిన తర్వాత ముగుస్తుంది.

షష్ఠి వ్రతం చేసే వారు ఈ రోజున పండ్లు తినండి. సూర్యాస్తమయం తర్వాత మాత్రమే ఆహారం తీసుకోండి.

ఆరోగ్య సంబంధిత సమస్యలున్నవారు షష్ఠి వ్రతాన్ని ఆచరించడం వలన ఆరోగ్యంగా ఉంటారు.

షష్ఠి వ్రతాన్ని ఆచరించే వ్యక్తి ఆ రోజున కొన్ని సుగంధ ద్రవ్యాలు, మాంసాహారం, మద్యపానం తీసుకోకూడదు.

ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపవాస దీక్షను పాటించండి. దగ్గరలోని శివాలయానికి కాని.. శుబ్రమణ్యేశ్వరుని ఆలయానికి కాని వెళ్లండి.. స్వామి వారికి పాలను సమర్పించడండి.

పూజ సమయంలో మనస్సును ప్రశాంతంగా ఉంచుకోండి. సుబ్రహ్మణ్యస్వామిని భక్తితో స్మరించుకుంటూ ఉండండి.

పూజ సమయంలో ఎలాంటి వివాదాలు, గొడవలు పెట్టుకోవద్దు. ఉపవాస సమయంలో మాంసాహారం, మద్యం సేవించవద్దు

స్కంద షష్ఠి అనేది హిందూ మతం ముఖ్యమైన పండుగ. ఈ రోజు ( జనవరి 5) కార్తికేయకు అంకితం చేయబడింది. ఈ రోజున కార్తికేయుడిని పూజించిన భక్తులకు ధైర్యం, తెలివి, విజయం సొంతం అవుతుంది. ఈ రోజున కార్తికేయుడిని పూజించడం వల్ల దుష్టశక్తులు నశిస్తాయని నమ్మకం ఉంది. కార్తికేయుని అనుగ్రహం వల్ల జీవితంలో సుఖసంతోషాలు, శ్రేయస్సు లభిస్తాయి. సంతానం కోసం ఈ రోజున ఉపవాసం ఉండి సుబ్రహ్మణ్యస్వామిని పూజించడం వలన సంతానం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి.

# కాలి మడమలు ఎందుకు పగుల్తాయ్.. అనారోగ్యాన్ని సూచిస్తుందా.. ట్రీట్ మెంట్ ఏంటీ..?

**ఒకటివీ యాడ్ లో వదిన, మరదలు కలిసి షాపింగ్ కు వెళ్తారు. వదినకు చెప్పులు కొనాలి. చెప్పుల షాపతను మేడమ్! మీ కాలు చూపించండి అంటారు. వదిన చాలా ఇబ్బంది పడుతుంది. ఎందుకంటే, ఆమె పాదాలు పగిలిపోయి. ఉంటాయి. ముఖ్యంగా మడమ భాగమంతా ఎక్కడికక్కడ పగిలిపోయి కనిపిస్తుంది. ఇలా ఎందుకవుతుంది? కాలి మడమలు ఎందుకు పగుల్తాయ్?**



**హైదరాబాద్ పెన్ పవర్:**పెద్దవాళ్లు.. చిన్నవాళ్లు అని తేడా లేకుండా అందరినీ ఇబ్బంది పెట్టే ఒక సమస్య అధికాళ్లు (ముఖ్యంగా మడములు) పగిలిపోవడం. ఇది కాళ్లకు వచ్చే ఒక సాధారణ చర్మ సమస్య కొంతమందికి మడమలు పగిలినా ఏ ఇబ్బందీ ఉండదు. చెప్పులు. షూస్ లేకుండా తిరిగినప్పుడు మాత్రం ఇబ్బందిగా ఉంటుంది. ఇంకొంతమందికి ఈ సమస్య మెల్లిగా పెరుగుతూ, నడిస్తేచాలు నొప్పి పెడుతుంది.

### ఎందుకు పగుల్తాయి

కాలి మడమ భాగమంతా పొడిగా ఉన్నప్పుడు బాగా నడిస్తే  ఇక్కడి చర్మమంతా సాగి పగుళ్లు వస్తాయి. ఇదొక ప్రధాన కారణం. ఇవి కాకుండా ఇంకా చాలా కారణాలున్నాయి.

ఎక్కువసేపు నిలబడి ఉండటం
చెప్పులు లేకుండా ఎక్కువసేపు నడవడం
ఎక్కువసేపు స్నానం చేయడం ...నీళ్లలో నానడం
కరుకుగా ఉండే సబ్బులు వాడటం
వాతావరణ మార్పుల (ముఖ్యంగా శీతాకాలాలు) వల్ల చర్మం పొడిబారడం.

ఈ కారణాలన్నీ కూడా అరికాళ్లు పగలడానికి కొన్ని కారణాలుగా చెప్పుకోవచ్చు. మాయిశ్చరైజరు అవసర మున్నప్పుడల్లా వాడితే ఈ పగుళ్లు రాకుండా పాదాలను కాపాడుకోవచ్చు.

### కొన్ని అనారోగ్య సమస్యలు కూడా..

కొన్నిసార్లు  అనారోగ్య పరిస్థితులు కూడా పాదాలు పగలడానికి కారణమవుతాయి

షుగర్ లెవెల్స్ పెరిగితే, రక్తప్రసరణ వేగం తగ్గి, పాదాలు పొడిగా మారిపోతాయి. ఈ పరిస్థితుల్లో కాలి మడమలు పగలే ప్రమాదం ఎక్కువ ఉంది.

గర్భిణీగా ఉన్నప్పుడు కాళ్లు పగలడం ఎక్కువగా కనిపిస్తుంది.

సోరియాసిస్, విటమిన్ లోపం, ఫంగల్ ఇన్ఫెక్షన్ , హైపోథైరాయిడిజమ్, డెర్మటైటిస్, ఒబెసిటీ. వయసు మీద పడటం వల్ల కూడా కాళ్ల పగుళ్లు వచ్చే ప్రమాదం ఉంది

### ఏమవుతుంది?

పాదాలు పగిలిపోవడం చాలాకాలం అలాగే ఉంటే, అది కొన్ని సమస్యలకు దారి తీయొచ్చు.

దురదపెట్టడం, నొప్పిగా ఉండటు రక్తస్రావం, చర్మం ఎర్రగా మారిపోవడం, అల్సర్... ఇవన్నీ పాదాలు పగిలి, కొంతకాలం అలాగే ఉంటే వచ్చే సమస్యలు. అందుకే కాళ్లు పగులుతున్నట్లు అనిపిస్తే ఆలస్యం చేయకుండా ట్రీట్ మెంట్ మొదలుపెట్టాలి.

### ట్రీట్ మెంట్ ఏంటి?

చికిత్స కంటే నివారణ మేలు అని చెబుతుంటారు అలాగే పాదాలు పగలకుండా జాగ్రత్తగా ఉండాలి.

చికిత్స విషయానికి వస్తే ఎప్పటికప్పుడు మాయిశ్చరైజర్ రాస్తూ ఉండటం మంచి పరిష్కారం.

పాదాలు, మడమలు వగలడాన్ని ముందే గుర్తించొచ్చు. అలా గుర్తించిన వెంటనే రోజుకు రెండు మూడు సార్లు మాయిశ్చరైజర్ రాస్తే పగుళ్లు రాకుండా చూసుకోవచ్చు. ఒకవేళ పగుళ్లు ఎక్కువ ఉంటే ముందు ఉన్న చర్మాన్ని ముందు పమిస్ స్టోన్ తో రుద్ది.. ఆ తర్వాత మాయిశ్చరైజర్ రాస్తే ఫలితం ఉంటుంది.

### ఇవి చేయండి

రోజూ మడమ భాగంలో హీల్ బామ్ రాస్తూ ఉంటే మంచిది.

మీ మడమపై ఒత్తిడి పెంచకుండా, ఎక్కువ గా ఎక్సపోజ్ అవ్వకుండా ఉండే షూస్ వేసుకోవాలి.

### ఇవి చేయకండి

ఫ్లిప్ ఫ్స్, సాండల్స్ వేసుకోవద్దు. మడమ భాగానికి ఇవ్వాల్సిన సపోర్ట్ వెనుక వైపు ఓపెన్ ఉండే షూస్ వాడకండి.

మడమ భాగంలో వెడల్పు..  తక్కువ ఉండే షూస్ వేసుకోకండి.

మరీ టైట్ గా ఉండే షూస్ వేసుకోవద్దు.

### ఇవి చేస్తే పగుళ్లు ఉండవు!

చాలాసేపు ఒకేదగ్గర కూర్చోకండి, కాలిపై కాలు వేసుకొని ఎక్కువ సేపు కూర్చోవద్దు.

మాయిశ్చరైజర్ వాడటమే కాకుండా, దాన్ని కవర్ చేస్తూ సాక్స్ లు.. షూస్ వేసుకోండి..

రోజూ అరికాళ్లను చెక్ చేసుకుంటూ ఉండండి. డయాబెటిస్ ఉంటే మరింత జాగ్రత్త అవసరం.

మడమ భాగానికి సరిగ్గా సరిపడేలా కొన్ని షూ ఫిటింగ్స్ ఉంటాయి. అవసరమైతే అవి వేసుకోండి.

ఏది పడితే అది కాకుండా, మంచి సాక్స్ లు  వాడండి. చర్మం పొడిబారొద్దంటే నీళ్లు బాగా తాగాలని గుర్తుంచుకోండి.

# తెలంగాణ హైకోర్టులో పూర్తిస్థాయి జడ్జీలు వుండాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**  సరిగ్గా ఆరు సంవత్సరాల క్రితం లోక్ సభ లో వేసిన ప్రశ్నోత్తరాల సమయం లో హైకోర్టు ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపాను. 2019 డిసెంబర్ 31 నాడు తెలంగాణ కు ప్రత్యేక హై కోర్టు వచ్చింది. తెలంగాణ హై కోర్టు కు 42 మంది జడ్జిలు ఉండాలని నిర్ణయం తీసుకున్నా ఎపుడూ 23 మంది కి మించి భర్తీ చేయడం లేదని మాజీ ఎంపి బి వినోద్ కుమార్ అన్నారు. తెలంగాణ జడ్జీల్లో ఎస్సీ ,ఎస్టీ లకు సంబంధించిన వారు ఎవ్వరూ లేరు. పూర్తి స్థాయిలో జడ్జీలను నియమిస్తే దళిత గిరిజన వర్గాలకు కూడా న్యాయం జరుగుతుంది. కేసీఆర్ హయం లోనే మేము పార్లమెంటు లో ఒత్తిడి చేసిన ఫలితంగా హై కోర్టు జడ్జీల సంఖ్యను 42 కు పెంచారు. .హై కోర్టు లో పెండింగ్ కేసుల సంఖ్య నానాటికి పెరిగి పోతోంది ..జడ్జీలు పూర్తి స్థాయిలో ఉంటె తప్ప కేసులు తొందరగా పరిష్కారం కావు. హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి వెంటనే జోక్యం చేసుకుని పూర్తి స్థాయి లో జడ్జీల నియమాకానికి చర్యలు చేపట్టాలి. సామాజిక న్యాయం న్యాయ వ్యవస్థ లో కూడా పాటించాల్సిందే. వేరే



రాష్ట్రాల నుంచి తెలంగాణ హై కోర్టులో నలుగురు జడ్జీలు ఉన్నారు. జడ్జీలు పూర్తి స్థాయిలో ఉంటేనే తెలంగాణ కు కూడా న్యాయం జరుగుతుంది. శామీర్ పేటకు మెట్రో రైల్ ప్రాజెక్టు వేస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదు. ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజల  కష్టాలు పోవాలంటే నాగపూర్ తరహాలో జేబీఎస్  నుంచి శామీర్ పేట కు డబుల్ డెక్ ఫ్లై ఓవర్ ను ఏర్పాటు చేయాలని అన్నారు.

# మరో కానిస్టేబుల్ ఆత్మహత్య

**హైదరాబాద్ పెన్ పవర్:**పోలీస్ కానిస్టేబుల్ ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మలకపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. మలక్ పేట ఎస్ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం... ఆస్మాన ద్ బస్తీలో నివాసం ఉంటున్న జనావత్ కిరణ్(36) ఫిలింనగర్ పోలీస్టేషన్లో కానిస్టేబుల్ (2014 బ్యాచ్) గా పనిచేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం అనారోగ్య కారణాలతో సెలవు తీసుకున్నట్లు సమాచారం. డిసెం బర్ 31న రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో కిరణ్?ప మలక్పేట పోలీసులకు భార్య ఫిర్యాదు చేసింది. కిరణ్ కూడా భార్యపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన కిరణ్ బుధవారం సాయంత్రం ఇంట్లోకి వెళ్లి గది తలుపులు బిగించుకున్నాడు. ఎంత పిలిచిన పలుకకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు బద్దలు కొట్టి చూడగా కిరణ్ ఫ్యాన్కు ఊరి వేసుకుని వేలాడుతూ కనిపిం చాడు. వెంటనే మలక్పేట పోలీసులకు సమాచార మిచ్చి, కిరణ్ను మలక్పేటలోని యశోద ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధా రించారు. పోస్ట్ మార్టం నిమిత్తం కిరణ్ మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసును నమోదు చేసుకున్న మలక్పేట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు మృతుడికి పదేళ్ల క్రితం పెళ్లి కాగా. భార్య లలిత. ఇద్దరు అమ్మాయిలు వున్నారు

# కిక్కిరిసిపోతున్న వైజాగ్ జైల్

**హైదరాబాద్ పెన్ పవర్:** విశాఖపట్నం జైలు ఖైదీలతో కిక్కిరిసిపోతోంది.. 950 మంది ఖైదీలను ఉంచగల సామర్థ్యం మాత్రమే ఉండగా ప్రస్తుతం 2,076 మంది ఖైదీలు ఉన్నారని అధికారులు తెలిపారు. జైలు సామర్థ్యానికి మించి ఖైదీలను ఉంచడంతో పర్యవేక్షణ, వసతుల కల్పన సవాలుగా మారిందని చెబుతున్నారు. ఇప్పుడు ఉన్న ఖైదీలలో శిక్ష ఖరారైన వారి సంఖ్య 440 మాత్రమేనని, మిగతా వారంతా రిమాండ్ ఖైదీలేనని తెలిపారు.

ఖైదీల సంఖ్య ఎక్కువగా ఉండడంతో గదులు సరిపోవడంలేదని, ఇరుకు గదిలో ఇబ్బంది పడుతున్నానంటూ ఓ ఖైదీ తన బంధువులకు చెప్పాడు. దీంతో ఖైదీ బంధువులు ఇటీవల జైలు ఎదుట ఆందోళన చేశారని సమాచారం. ఈ క్రమంలోనే 200 మంది ఖైదీలను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.




**జైలులో మొత్తం 16 బ్యారక్ లు..**

రాష్ట్రంలో గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపడం, తనిఖీలు పెంచడంతో పెద్ద సంఖ్యలో నిందితులు పట్టుబడుతున్నారు. వారిని కోర్టు ఆదేశాలతో విశాఖ సెంట్రల్ జైలుకు అధికారులు తరలిస్తున్నారు. అయితే, జైలులో మొత్తం 16 బ్యారక్ లు ఉండగా.. అందులో 950 మంది ఖైదీలను ఉంచే వీలుంది. ప్రస్తుతం ఈ జైలులో 2,076 మంది ఖైదీలు ఉన్నారు.ఇందులో 1,145 మంది గంజాయి కేసుల్లో పట్టుబడి రిమాండ్ ఖైదీలుగా వచ్చిన వారేనని అధికారులు తెలిపారు. మిగతా వారిలో 440 మంది ఖైదీలకు శిక్ష ఖరారైందని చెప్పారు. మరోవైపు, క్షమాభిక్ష కింద విడుదలయ్యే అవకాశం ఉన్న ఖైదీలు 40 మందికి పైనే ఉన్నారు కానీ మూడేళ్లుగా క్షమాభిక్ష జాబితాను ప్రకటించలేదని సమాచారం.

**సిబ్బంది 90 మందే..**

జైలు నిబంధనల ప్రకారం 150 మంది సిబ్బంది ఉండాల్సింది కానీ ప్రస్తుతం 90 మంది మాత్రమే ఉన్నారని అధికారులు తెలిపారు. దీంతో సిబ్బంది కొరత వేధిస్తోందని డీఐజీ రవికిరణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. మరో 30 మంది సిబ్బందిని కేటాయించాలని కోరినట్లు తెలిపారు. సిబ్బంది తక్కువగా ఉండడం వల్ల పూర్తిస్థాయిలో ఖైదీల పర్యవేక్షణ సవాలుగా మారిందన్నారు. విశాఖ జైలులో మరో భవన నిర్మాణానికి రూ.26 కోట్లు విడుదల చేయడానికి కేంద్ర హోంశాఖ అంగీకరించింది. అదేవిధంగా ఓపెన్ జైలు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో మరో 250 మంది ఖైదీలను ఉంచేందుకు ఏర్పాట్లు చేయవచ్చని అధికారులు తెలిపారు. భద్రతా ఏర్పాట్ల కోసం ఏపీ ప్రభుత్వం మరో రూ.75 లక్షలు కేటాయించినట్లు వివరించారు.

## బాత్రూం కిటికీపై ఆ ఫింగర్ ప్రింట్స్ ఎవరివి..? సీఎంఆర్ కాలేజ్ లేడీస్ హాస్టల్ వీడియో బయటకి..



**హైదరాబాద్ పెన్ పవర్:** మేడ్చల్ కండ్లకోయ సీఎంఆర్ కాలేజ్‌లో దారుణం జరిగింది. కాలేజ్ లేడీస్ హాస్టల్ బాత్‌రూమ్‌ల్లో వీడియోలు తీశారని హాస్టల్ ముందు స్టూడెంట్స్, విద్యార్థి సంఘాల నాయకులు ధర్నాకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. హాస్టల్‌లో వంట చేసే వారే వీడియోలు తీసి ఉంటారని విద్యార్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాత్రూమ్ కిటికీలపై ఫింగర్ ప్రింట్స్ కనిపించడంతో కచ్చితంగా ఏదో తప్పుగా జరిగిందని స్పష్టమవుతోంది. బాత్రూం వెంటిలేటర్ అద్దాలపై ఫింగర్ ప్రింట్స్ కనిపించాయి. ఈ ఫింగర్ ప్రింట్స్ ఎవరివి..? ఇప్పుడు %జవీ=ు% కాలేజ్‌లో ఇదే అంతుచిక్కని ప్రశ్న. బయట వ్యక్తులు లేడీస్ హాస్టల్ లోపలికి వచ్చి వీడియోలు తీసే అవకాశమే లేదు.

సో.. హాస్టల్ లో విద్యార్థునుల బాగోగులు చూసుకునేందుకు ఉండే సిబ్బంది గానీ, వంట చేసేందుకు ఉండే వాళ్లు గానీ ఈ పని చేసి ఉంటారనేది విద్యార్థినుల అనుమానం. విద్యార్థినుల బాత్రూం పక్కనే పని చేసే వాళ్ల గది ఉండటం కూడా ఈ అనుమానాలు మరింత బలపడేందుకు కారణమవుతుంది. వీడియోలు తీశారని వార్డెన్‌కు తెలిపితే, అసభ్యంగా మాట్లాడుతుందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. వీడియోలు తీసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేసారు.

**ఈ ఉదంతంపై మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి ఏమన్నారంటే..**

- CMR కాలేజ్‌లో ఘటనపై మాకు ఫిర్యాదు అందింది.
- హాస్టల్ గదిలోని ఒక బాత్ రూం వద్ద కిటికీలో నుంచి ఒక అగంతకుడు తొంగి చూశాడని ఫిర్యాదు అందింది.
- స్పాట్‌కి చేరుకుని కిటికీపై ఉన్న ఫింగర్ ప్రింట్స్ క్లూస్ సేకరించాం.
- మెస్‌లో పనిచేసే 5 మందిపై విద్యార్థినులు అనుమానం వ్యక్తం చేశారు.. వాళ్ళను అదుపులోకి తీసుకున్నాం.
- వాళ్ళ మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకుని వీడియోస్ చెక్ చేస్తున్నాం..
- రికార్డ్ చేసి ఉంటే.. చర్యలు తీసుకుంటాం.. మొత్తం 12 ఫోన్లు స్వాధీనం చేసుకున్నాం..
- హాస్టల్ పరిసరాలను పరిశీలించాం.. ఇద్దరు ఫింగర్ ప్రింట్స్ లభించాయి.
- మెస్‌లో పనిచేసే వ్యక్తులు మాత్రమే లోపలికి వచ్చే అవకాశం ఉంది.
- నిన్నటి(జనవరి 1 రాత్రి) నుంచి మా టెక్నికల్ టీం ఫోన్లని అనేక విధాలుగా పరిశీలించారు.
- వాటిలో ఎలాంటి వీడియోలు, ఫొటోలు లభించలేదు.
- ఒకవేళ డిలీట్ చేసి ఉంటారని ఫోన్లన్నీ ల్యాబ్ కు పంపించాం.
- ఇప్పటివరకు అయితే ఎలాంటి వీడియోలు లభించలేదు.
- విద్యార్థులు భయాందోళనకు గురికావద్దు.
- ఈ ఘటనలో యాజమాన్యం నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతోంది.
- ఇప్పటివరకు యాజమాన్యం నుంచి ఎటువంటి ఫిర్యాదు రాలేదు.
- యాజమాన్యంతో మాట్లాడదామనుకుంటే అందుబాటులోకి రావడం లేదు.
- హాస్టల్ పరిసరాలు పరిశీలించిన తర్వాత విద్యార్థినుల భద్రతను యాజమాన్యం పట్టించుకోలేదనిపించింది.
- విద్యార్థినుల స్టేట్మెంట్ రికార్డు చేశాం.. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం.
- ఇక్కడ విద్యార్థుల ఆందోళన చేస్తుంటే కనీసం భద్రత కావాలని కూడా పోలీసులను యాజమాన్యం అడగలేదు.
- దర్యాప్తులో భాగంగా యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం.

## జీపీ కారోబార్ సిబ్బంది క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి



**హైదరాబాద్ పెన్ పవర్:** గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో గ్రామపంచాయతీ ఉద్యోగుల జీతాలు 15 నెలల వరకు పెండింగ్లో ఉండగా, తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవతో రూ.192 కోట్ల నిధులు విడుదల అయ్యాయని తెలంగాణ స్టేట్ గ్రామపంచాయతీ కారొబార్ సిబ్బంది అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు... ఉద్యోగుల జీతాలు నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ అవుతున్నాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా, 2025 సంవత్సరానికి సంబంధించిన అసోసియేషన్ క్యాలెండర్ను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాంపల్లి పబ్లిక్ గార్డెన్లో ఆవిష్కరించారు.. అనంతరం అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వంగా రవీందర్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, గ్రామపంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# మహిళలు ఒక్క సిగరెట్ తాగితే జరిగేది ఇదే.. తాజా అధ్యయనంలో నివ్వెరపరిచే నిజాలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** ధూమపానం ప్రాణాంతకమని ప్రభుత్వాలు, వైద్యరంగ నిపుణులు ఎంత హెచ్చరించినా కొందరు వ్యక్తులు ఆ అలవాటును మానుకోవడం లేదు. అలాంటివారిని అప్రమత్తం చేసే మరో అధ్యయనం వెలువడింది. ఒక్క సిగరెట్ పురుషుల ఆయుష్షను సగటున 17 నిమిషాలు, స్త్రీల ఆయుర్దాయాన్ని సగటున 22 నిమిషాలు తగ్గుతుందని యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ లండన్ పరిశోధకులు తేల్చారు. ఈ మేరకు 'జర్నల్ ఆఫ్ అడిక్షన్'లో తాజా అధ్యయనం ప్రచురితమైంది.

రోజుకు 10 సిగరెట్లు తాగే అలవాటు ఉన్న వ్యక్తి 2025 జనవరి 1న ధూమపానం అలవాటును మానేస్తే జనవరి 8 నాటికి ఒక పూర్తి రోజు జీవితాన్ని పొందవచ్చని అధ్యయనం సూచించింది. ఫిబ్రవరి 5 నాటికి ఆయుర్దాయం ఒక వారం రోజులు, ఆగస్టు 5 నాటికి ఒక నెల పెరుగుతుందని పేర్కొంది. ఏడాదిపాటు ధూమపానానికి దూరమైతే 50 రోజుల జీవితకాల నష్టాన్ని తగ్గించుకోవచ్చని లెక్కగట్టింది. ధూమపానం హానికరమనే విషయం సాధారణ ప్రజలు అందరికీ తెలుసని, అయితే హానిని తక్కువగా అంచనా వేస్తున్నారని ఆల్కహాల్ అండ్ టొబాకో రీసెర్చ్ గ్రూప్‌లో సభ్యుడిగా ఉన్న ప్రిన్సిపల్ రీసెర్చ్ ఫెలో డాక్టర్ సారా జాక్సన్ అన్నారు. ధూమపానం మానేయని వారు సగటున ఒక దశాబ్దకాలం జీవితాన్ని కోల్పోతారని 'ది గార్డియన్'తో చెప్పారు. ధూమపాన ప్రియులు తమ జీవితంలో విలువైన సమయాన్ని కోల్పోతున్నామనే విషయాన్ని గుర్తించలేరని, వృద్ధాప్య సమస్యలే ఇందుకు కారణమని అన్నారు. 70 ఏళ్లు బతికే అవకాశం ఉన్న వ్యక్తులు పదేళ్ల జీవితకాలాన్ని కోల్పోతారని జాక్సన్ వివరించారు. ఆరోగ్యంగా ఉండాలనుకునేవారు పూర్తిగా అలవాటును వదిలేయాలని సూచించారు. ధూమపానం గుండె జబ్బులు, స్ట్రోక్ వంటి పరిస్థితులకు దారితీస్తుందని, ఈ పరిస్థితుల ప్రమాదాన్ని దాదాపు 50 శాతం మేర పెరుగుతాయని పేర్కొంది.

# హాస్టల్ బాత్‌రూమ్‌లో విద్యార్థినుల నగ్న వీడియోల ఇష్యూ.. సీఎంఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఏమన్నారంటే..?




**హైదరాబాద్ పెన్ పవర్:** మేడ్చల్‌లోని సీఎంఆర్ కాలేజీ లేడీస్ హాస్టల్ బాత్ రూమ్‌లో విద్యార్థినుల నగ్న వీడియోలు చిత్రీకరించారని స్టూడెంట్స్ చేస్తోన్న ఆందోళనపై ఆ కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణ స్పందించారు. గురువారం (జనవరి 2) ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాత్ రూమ్‌లో సెల్ ఫోన్ పెట్టి తమ ప్రైవేట్ వీడియోలు చిత్రీకరిస్తున్నారని విద్యార్థినులు బుధవారం (జనవరి 1) మధ్యాహ్నం తమకు కంప్లైంట్ చేశారని ఆయన తెలిపారు. కుకింగ్ డిపార్ట్మెంట్‌లోని కొందరు అనుమానితులను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. వార్డెన్ టర్మినేట్ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారని.. వారి కోరిక మేరకు హాస్టల్ వార్డెన్ ను విధుల నుండి తొలగించామన్నారు. ఈ విషయంలో అండగా ఉంటామని విద్యార్థునులకు హామీ ఇచ్చామని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. హాస్టల్ సీసీ టీవీ ఫుటేజ్ పోలీసులకు ఇచ్చామని.. పోలీసుల విచారణకు పూర్తిగా సపోర్ట్ చేస్తామన్నారు. ఈ ఘటన నుండి హాస్టల్ వార్డెన్ ప్రీతిని మేం తప్పించినట్లు తప్పుడు ప్రచారం జరుగుతోందని.. ఇప్పటికే మేం ఆమెను టర్మినేట్ చేశామని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఐదుగురు లేడి సీనియర్ స్టాఫ్ తో కమిటీ వేసి విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. స్టూడెంట్స్ మా పిల్లలతో సమానమని.. వారి భద్రతే మాకు ముఖ్యమన్నారు. నిందితులు ఎవరైనా సరే సీరియస్ యాక్షన్ తీసుకొంటామని స్పష్టం చేశారు.

హాస్టల్ బాత్ రూమ్ లో మొబైల్ ఫోన్లు పెట్టి తమ నగ్న వీడియోలు చిత్రీకరిస్తున్నారంటూ సీఎంఆర్ కాలేజీ విద్యార్థునులు బుధవారం ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. స్టూడెంట్స్ కు మద్దతుగా విద్యార్థి సంఘాలు రంగంలోకి దిగి.. కాలేజీ ఎదుట ఆందోళన చేస్తున్నాయి. ఈ ఘటనపై దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు.. హాస్టల్ కుకింగ్ డిపార్ట్మెంట్ లో కొందరిని అదుపులోకి తీసుకున్నారు. వారి మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# మాదాపూర్ పేస్ హాస్పిటల్ లో దారుణం

**తాకూర్ సినిమాను తలపించేలా వైద్యం చేసిన పేస్ హాస్పిటల్స్ సిబ్బంది...**

**హైదరాబాద్ పెన్ పవర్:** చనిపోయిన రోగికి చికిత్స చేసిన ఆసుపత్రి సిబ్బంది నిర్వాకం బయటపడింది. లింగంపల్లి కి చెందిన ఎల్లమ్మ (60), రెండు రోజుల క్రితం లివర్ ప్రాబ్లం తో బాధపడుతూ పేస్ హాస్పిటల్ లో చేరింది. పేషంట్ అడ్మిన్ పేస్ హాస్పిటల్ యజమాన్యం సమయంలో రెండు లక్షల20 వేలు కట్టించుకుంది. బుధవారం ఉదయం ఎల్లమ్మ ఆరోగ్యం మెరుగుపడింది అని పేస్ హాస్పిటల్ డాక్టర్లు తెలిపింది. కుటుంబ సభ్యులకు తరువాత రోజు డిశ్చార్జ్ చేస్తామని తెలిపింది. గురువారం ఉదయం ఎల్లమ్మ పరిస్థితి విషమంగా ఉందని ఇంకా మూడు లక్షలు చెల్లించాలని తెలిపింది. హాస్పిటల్లో డిపాజిట్ చేయడానికి వెళ్ళగా ఎల్లమ్మ చనిపోయిందని హాస్పిటల్స్ సిబ్బంది తెలిపారు. డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల ఎల్లమ్మ చనిపోయిందని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

# కంటోన్మెంట్ అభివృద్ధిలో బిజెపి నాయకుల పాత్ర కీలకం



**సికింద్రాబాద్ పెన్ పవర్::** సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధిలో బిజెపి నాయకులు మరియు కార్యకర్తల పాత్ర కీలకంగా ఉందని వారి కృషి ఫలితంగా కంటోన్మెంట్ లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కంటోన్మెంట్ బోర్డు మెంబర్ జన్యావుల రామకృష్ణ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ వార్డ్ 6, పద్మనాభ కాలని ( మారుతీ నగర్ ఎక్సటెన్షన్) లో 15 లక్షల రూపాయలతో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి కంటోన్మెంట్ బోర్డ్ మెంబర్ జన్యావుల రామకృష్ణ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి నాయకులు మరియు కార్యకర్తలు నిరంతరం ప్రజల మధ్యలో ఉండి సమస్యలను గుర్తించి పరిష్కారానికి ఎంతగానో కృషి చేస్తున్నారని, ప్రజలతో మమేకమై ఎప్పటికప్పుడు ప్రతీ విషయాన్ని అధికారుల దృష్టికి మరియు నాయకుల దృష్టికి తీసుకువెళ్ళి అభివృద్ధి పనులు చేయించుకుంటున్నారని పేర్కొన్నారు.

వారి త్యాగం, వారి పోరాటం, సమస్యలపై వారు స్పందించే తీరు గొప్పదని కొనియాడారు. తరువాత కాలనీ వాసులు మాట్లాడుతూ ఫోన్ చేసిన వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించడంలో రామకృష్ణ ముందుంటారని, ఏ సమస్య వచ్చిన నేనున్నాను అంటూ భరోసా కల్పిస్తారని, వారి కృషి ఫలితంగా కంటోన్మెంట్ అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ రామకృష్ణ ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ 6 బిజెపి అధ్యక్షులు అజయ్ గౌడ్, నాయకులు రవీందర్ రెడ్డి, నాగభూషన్, నారాయణ, స్వరూప, భారతి, రమేష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, నిరంజన్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు

# ఓరుగల్లు కమలానికి కష్టాలు...

**వరంగల్, జనవరి 2, పెన్ పవర్:** ఓరుగల్లు జిల్లా నేతల తీరు తలనొప్పిగా మారిందట. అంతర్గత వర్గపోరుతో క్యాడర్‌ను చేజార్చుకుంటున్న నేతలు ఇప్పుడు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ అధిష్టానానికి లేఖలు సంధిస్తున్నారట. దీంతో ఏం చేయాలో అర్థం కాక తల పట్టుకుంటున్నారట కాషాయ పెద్దలు. దేశవ్యాప్తంగా బలాన్ని పెంచుకునేందుకు బిజెపి ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ బలోపేతం కోసం పావులు కదుపుతోంది పార్టీ తప్పిదాలు, అంతర్గత కుమ్ములాటల కారణంగా బలహీనపడుతున్నామని తెలుసుకున్న అదిష్టానం.. మొదటగా పార్టీలో నూతన కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. బూత్ స్థాయి కమిటీల నిర్మాణం పూర్తికాగా.. మండల, జిల్లా స్థాయి కమిటీలను జనవరి మొదటి వారంలో ప్రకటించనుంది. క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరించే కమిటీల ఏర్పాటుకు సంబంధించి వర్గ పోరు తరాస్థాయికి చేరుతోంది. నేతల మధ్య వర్గపోరు కారణంగా తమ తమ అనుచరులకే కమిటీలలో అవకాశం కల్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో పార్టీ కోసం కష్టపడ్డ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది.ప్రస్తుత హనుమకొండ జిల్లా అధ్యక్షురాలుగా ఉన్న రావు పద్మకు వ్యతిరేకంగా హనుమకొండ జిల్లా నేతలంతా ఒక్కటయ్యారు. వరుసగా మూడుసార్లు అధ్యక్షురాలుగా పనిచేసిన రావు పద్మపై బిజెపిలోని మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలంతా గుర్రుగా ఉన్నారు. రావు పద్మ సీనియర్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వట్లేదని ఆరోపణలు ఉన్నాయి. అందుకే



రావు పద్మను కాదని మిగతా నేతలంతా ఒక్కటై పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జిల్లా అధ్యక్షురాలి పదవిలో ఉండి నేతలందరినీ కలుపుకోవాల్సిన ఆమె, వర్గాలను పెంచి పోషించారని బహిరంగంగానే బిజెపి శ్రేణులు ఆరోపిస్తున్నాయి. కేంద్రంలో ఉన్న బిజెపి హనుమకొండకు చేసిన అభివృద్ధి పనులను సైతం ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తీవ్రంగా విఫలమయ్యారని బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, స్మార్ట్ సిటీ నిధులు బిజెపి ప్రకటిస్తే, ఈ విషయాలను కనీసం ప్రజల్లోకి తీసుకెళ్లలేదని మండిపడుతున్నారు.అన్ని జిల్లాలలో బీజేపీ పార్టీ కార్యాలయాలు ఉండగా, హనుమకొండ జిల్లాలో మాత్రం రావు పద్మ సొంత భవనంలో పార్టీ కార్యాలయాన్ని నడుపుతున్నారు. దీంతో రావు పద్మ వ్యతిరేకిస్తున్న కీలక నేతలంతా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. మరికొంతమంది వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అన్ని జిల్లా కేంద్రాలలో బీజేపీ పార్టీ కార్యాలయాలు నిర్మాణం జరిగింది కానీ.. హనుమకొండ జిల్లాలో మాత్రం ఆ నిధులను జిల్లా అధ్యక్షురాలు వాడుకున్నారని ఆరోపిస్తున్నారు కాషాయ నేతలు. మూడు సార్లు జిల్లా అధ్యక్ష పదవిలో కొనసాగినప్పటికీ, పార్టీ కార్యాలయాన్ని ఎందుకు నిర్మించలేకపోయారని మండిపడుతున్నారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం మరో అభ్యర్థికి టికెట్ ఇచ్చి ఉంటే గెలిచే అవకాశాలు ఉండేవని, రావు పద్మకు టికెట్ కేటాయించడంతో బిజెపి శ్రేణులే వ్యతిరేకించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. రావు పద్మ కారణంగా పార్టీ తీవ్రంగా డ్యామేజ్ అవుతోందని, ఆమెను అధ్యక్ష పదవి నుండి తొలగించాలని అధిష్టానానికి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు సైతం వెళ్లాయి. అయినా అధిష్టానం ఎటువంటి చర్యలు తీసుకోలేదు.బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి కోసం నాంపెల్లి శ్రీనివాస్, సంతోష్ రెడ్డి, రావుల కిషన్, గుజ్జుల వసంత, మరికొంత మంది నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే తన వర్గానికి చెందిన వ్యక్తికే జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని రావు పద్మ అధిష్టానం పై ఒత్తిడి తెస్తున్నారంట. ఆ క్రమంలో రావు పద్మ అనుచరులకు పదవి దక్కకుండా ఇతర నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారట. వచ్చే ఎన్నికల్లో హనుమకొండలో బిజెపి జెండా ఎగురుతుందని, అందుకే అధ్యక్ష పదవి ఎంపికలో ఆచితూచి వ్యవహరించాలని అధిష్టానానికి కొంతమంది నేతలు లేఖలు రాసారట. ఇన్నేళ్లు పార్టీ కోసం కష్టపడ్డ వారిని రావు పద్మ పట్టించుకోలేదని, ఆమె కారణంగానే పార్టీ బలహీనపడుతోందని సీనియర్లు విమర్శిస్తున్నారు. ఒకవేళ ఈ సారి కూడా పార్టీ పదవి ఆమె అనుచరులకే ఇస్తే.. పార్టీని వీడాల్సి వస్తుందని పద్మ వ్యతిరేకులు హెచ్చరిస్తున్నారు.

# జగిత్యాల నుంచే కవిత పోటీ...?

**కరీంనగర్, జనవరి 2, పెన్ పవర్:** ఢిల్లీ లిక్కర్ స్కాం లో అరెస్టు అయి బెయిల్‌పై బయటకు వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొన్నాళ్ళు మౌనం తరువాత ఇప్పుడు యాక్టివ్ అయిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకి వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే శాసనమండలి సమావేశాల్లో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదేసే ప్రయత్నం చేశారు. నిజామాబాద్ ఎంపీగా ఒక్కసారి గెలిచి, రెండు సార్లు ఓడిపోయిన కవిత తండ్రి ఆశీస్సులతో ప్రస్తుతం శాసనమండలి సభ్యురాలిగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆమె అసెంబ్లీకి పోటీ చేస్తానంటున్నారంట.

బెయిల్ వచ్చాక ఇన్ని రోజులు మౌనమే అన్నింటికి సమాధానం అన్నట్లు వ్యవహరించిన కవిత ఇప్పుడు తనకి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిన బతుకమ్మనే మరో సారి నమ్ముకొని మరోసారి తెలంగాణ సెంటిమెంట్ ని రగల్చే పనిలో పడినట్లు కనిపిస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లికి సంప్రదాయ రూపమిచ్చి.. సెక్రటేరియట్‌లో అధికారికంగా ప్రతిష్టించింది. అయితే తెలంగాణ తల్లి విగ్రహం చేతిలో బతుకమ్మ లేదని బీఆర్ఎస్ రచ్చ చేస్తుంది. తెలంగాణ జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు కవిత ఏ సెంటిమెంట్‌ని తన అస్త్రంగా రాజకీయాలకి వాడుకున్నారో.. ఇప్పుడు అదే సెంటిమెంట్‌ని మరోసారి రగిలించే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ప్రభుత్వం ఆవిష్కరించి తెలంగాణ తల్లి విగ్రహాన్ని.. కాంగ్రెస్ తల్లి అంటూ నిరసనలు తెలుపుతూ? బతుకమ్మ లేని తెలంగాణ తల్లి ని ఒప్పుకోమని



జగిత్యాల లో 20 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకి భూమిపూజ చేసారు. యితే జగిత్యాలలోనే ఆమె తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం వెనుక ప్రత్యేక కారణాలు ఉన్నాయని బీఆర్ఎస్ శ్రేణులు, జాగృతి శ్రేణులు భావిస్తున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో కవిత జగిత్యాల నుండి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతుంది.ఇంకా ఎన్నికలకు నాలుగేళ్ల సమయం ఉండడంతో ఇప్పటి నుండే జగిత్యాల నియోజకవర్గం లో గ్రౌండ్ వర్క్ చేసుకుని జైత్రయాత్రకి సిద్ధమవ్వాలని భావిస్తున్నారంట. అందుకే తరుచుగా జగిత్యాల బీఆర్ఎస్ లీడర్లతో సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని ఫిక్స్ అయ్యారంట. అందుకే మరోసారి తెలంగాణ సెంటిమెంట్ , తెలంగాణ తల్లి సెంటిమెంట్ ని రగిల్చేందుకు బతుకమ్మ తో కూడిన తెలంగాణ తల్లి ఏర్పాటుకు జగిత్యాలలోనే భూమిపూజ చేసారంట. అయితే ఆమె జగిత్యాలలో అంత యాక్టివ్ అయి. పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తుండటం వెనుక మరో కారణం ఉందని బీఆర్ఎస్ శ్రేణులు అంటున్నాయి.గత రెండు అసెంబ్లీ ఎన్నికలలో జగిత్యాలలో అన్ని తానై తన అనుంగ అనుచరుడిగా పేరున్న సంజీవ్‌కుమార్‌ను కవిత గెలిపించుకున్నారు. ఆయన కాంగ్రెస్ లో చేరడాన్ని కవిత జీర్ణించుకోలేక పోతున్నారట. అప్పటి వరకు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న జగిత్యాలలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డిని టార్గెట్ చేసి ఆయనకు కవిత చెక్ పెట్టగలిగారు. జగిత్యాలలో కంటి వైద్యుడిగా మంచి పేరున్న డాక్టర్ సంజయ్ కుమార్‌ను బీఆర్ఎస్ అభ్యర్థిగా నిలబెట్టి అసెంబ్లీ ఎన్నికలలో ప్రచారం చేసి జీవన్‌రెడ్డిని ఓడిస్తానన్న ఛాలెంజ్‌ను నిలబెట్టుకున్నారు.2023 అసెంబ్లీ ఎన్నికల తరువాత ఒక్కసారిగా రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోయాయి. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో పాటుగా లిక్కర్ స్కాంలో కవిత అయిదునెలలు పైగా తీహార్ జైలుకు వెళ్లడంతో జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ క్యాడర్ పూర్తిగా నైరాశ్యంలో మునిగిపోయింది. ఇటు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కూడా నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరిపోయారు. సంజయ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని బీఆర్ఎస్ క్యాడర్ ముఖ్యంగా కేటీఆర్, కవితలకు అస్సలు మింగుడు పడటం లేదంట.తనకి అనుంగ అనుచరుడుగా ఉన్న వెలమ సామాజిక వర్గానికి చెందిన సంజయ్‌కుమార్ కాంగ్రెస్ లో చేరడంతో ఆయన గెలుపు కోసం తాను పట్ట కష్టమంతా వృధా అయిందని కవిత ఫీలవుతున్నారంట. అందుకే జగిత్యాల నుండి తానే స్వయంగా బరిలోకి దిగి సంజయ్‌కుమార్‌ని ఓడించి జగిత్యాల గులాబీ పార్టీకి కంచుకోట అని నిరూపించాలని కంకణం కట్టుకున్నారంట. అందులో భాగంగా రానున్న రోజుల్లో జగిత్యాలలోనే మకాం వేసి కార్యక్రమాలు నిర్వహించేలా ప్లాన్ చేసుకుంటున్నారంట. మరి చూడాలి బెయిల్‌పై బయట తిరుగుతున్న కవిత ప్రయత్నాలు ఎంత వరకు ఫలిస్తాయో?